క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందిస్తున్న కోలేటి కుటుంబ సభ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి బుధవారం దాతలు విరాళాలు సమర్పించారు. ఖానాపురంకు చెందిన శ్రీలక్ష్మి ఎలక్ట్రికల్స్ అధినేతలు కోలేటి రామారావు–పుల్లమ్మ దంపతులు రూ.25,116లు, కైకొండాయిగూడెంకు చెందిన బానోత్ రాజశేఖర్–రాధ దంపతులు రూ.5,116లు, ఖమ్మం బైపాస్‌రోడ్డుకు చెందిన రఘునందన్‌రెడ్డి–బ్రహ్మణి దంపతులు రూ.10వేలను విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

ఆర్థిక సాయం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరానికి చెందిన రచ్చ రమారావు సతీమణి ఇటీవల మృతి చెందింది. ఈ మేరకు బొమ్మా ప్రసాద్ జ్ఞాపకార్థం తండ్రి బొమ్మా నాగేశ్వరరావు ఆధ్వర్యాన సీనియర్ సిటిజన్ సభ్యులు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని రమారావుకి అందించారు. అలాగే సింధూర్ పాన్‌షాప్ నిర్వాహకుడు ఉదారి మోహన్ కూడా తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ, నాగరాజు, ఫణితేజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి అండగా ఎఫ్‌ఏ



పండ్లు అందిస్తున్న ఎఫ్‌ఏ మాన్‌సింగ్‌నాయక్

కామేపల్లి: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపాన ఓ మతిస్థిమితం లేని వృద్ధుడు గత మూడు నెలలుగా చెట్టు కింద జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యాన తినడానికి తిండిలేక ఇబ్బంది పడుతున్న ఆ వృద్ధుడికి కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘ జిల్లా కోశాధికారి ధరావత్ మాన్‌సింగ్‌నాయక్ ప్రతీ రోజు అతడికి అన్నంతో పాటు పండ్లు, మంచినీరు అందిస్తూ అండగా నిలుస్తున్నాడు. ఈమేరకు పలువురు ఎఫ్‌ఏ ను అభినందిస్తున్నారు.

5వ డివిజన్‌లో జీరో బిల్లుల అందజేత

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే పేదలకు జీరో బిల్లులు అందజేస్తున్నట్లు ఎంపీటీసీ పల్లెబోయిన భారతి చంద్రం, విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్, ఏఈ భాస్కర్‌లు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 5వ డివిజన్‌లో జీరో బిల్లులు అందజేసిన సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఈ పథకం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, యల్లంపల్లి హనుమంతురావు, నాగేంద్రసింగ్, నామాల క్రిష్ణయ్య, విజయ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: వీధి కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన తుమ్మా కొండయ్య, సామాల గౌతమిలను బుధవారం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబసభ్యులు వారిరువురిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తరలించి చికిత్స అందించారు. ఈనేపథ్యాన గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వెంటనే వాటిని గ్రామం నుంచి బయటకు తరిమికొట్టాలని గ్రామస్తులు మండల పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు.

పోలీసులను దూషించిన మహిళపై కేసు

ఖమ్మంక్రైం: పోలీసులను దూషించిన ఓ మహిళపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీ క్లబ్ వద్ద నెహ్రూనగర్ సెంటర్‌లో తోపుడు బండ్లను తీసేయాలని పోలీసులు సూచించగా దేరంగుల పద్మ దూషించింది. దీంతో ఆమె కేసు నమోదు చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరు పేరు భైరవకోన
వినోద	ఆపరేషన్ వాలెంటైన్
సాయిరాం	డ్యూన్
ఆదిత్య	కిక్
శ్రీనివాస	చారి 111
సుందర్	హనుమాన్

– ఖమ్మంగాంధీచౌక్

కోరిందే తడవుగా..



కోరిన కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి

- తీర్థాల సంగమేశ్వరుడి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర
- మహిమ గల దేవుడిగా భక్తుల నమ్మకం
- నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఈ ఏడాది నీటి ఇబ్బందులు తప్పవా?



తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయం(ఇన్‌సెట్) గర్భగుడిలోని శివలింగం

భక్తులు కోరిందే తడవుగా..

కోర్కెలను తీర్చే మహిమ గల స్వామిగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయానికి పేరుంది. ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉండడంతో ప్రతీ జాతరకు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించిపోతుంటారు. ఆలయం పక్కనే గల త్రివేణి సంగమంలో మహా శివరాత్రికి స్నానమాచరించి శివుడి దర్శనం చేసుకుంటే ఎంతో పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం.

– ఖమ్మంరూరల్

ఆలయం వేలిసిందిలా..

చారిత్రక ఆధారాల ప్రకారం త్రేతాయుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవానికి శివపార్వతులు వచ్చి తిలకించి సప్తరుషులతో కలిసి తిరిగి వెళ్తుండగా.. మార్గ మధ్యలో కొంత మంది వెళ్లిపోతారు. ఈనేపథ్యాన త్రిమూర్తులు మౌదగల్య, అత్రేయ, బృగు మహా రుషులతో వెళ్తున్న స్వామివారు మూడు నదులైన మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు వద్ద కొద్దిసేపు సేద దీరుతారు. ఈ సమయాన మార్గమధ్యలో వెళ్లిపోయిన కొంతమంది రుషులకు శివుడు కలలోకి వచ్చి తనను ఈ ప్రాంతంలో శివలింగాకా రంలో ప్రతిష్టించాలని చెప్పడంతో వారు శివలింగాకారాన్ని ఏర్పాటు చేసి సంగమేశ్వరుడి ఆలయంగా నామకరణం చేశారు. అనంతరం శివలింగాకారంతో ఆలయం కీకారణ్యంలో కలిసిపోయింది.

బయటపడిన ఆనవాళ్లు..

ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బజ్జురు నాగయ్య ఔషధ మూలికల కోసం నది ఒడ్డున ఉన్న మట్టి దిబ్బను తవ్వుతుండగా.. కొన్ని ఆలయ ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో గ్రామస్తులతో కలిసి లోతుగా తవ్వగా.. గోపురం లేకుండా గది మాదిరి నిర్మాణం బయటపడింది. దీంతో రుషులు చెప్పిన మాదిరిగా ఆలయానికి తూర్పున కుమారస్వామి, పడమర కాలభైరవుడు, ఉత్తరాన వినాయకుడు, దక్షిణాన ఆంజనేయస్వామిని ప్రతిష్టించి దీపారాధన కోసం ఆరడుగుల రాతి స్తంభం ఏర్పాటు చేసినట్లు తాళపత్ర గ్రంథంలో రాయబడి ఉంది. ఇక్కడ మున్నేరు, ఆకేరు, బుగ్గేరులు కలిసే ప్రాంతం కాబట్టి మున్నేరు అనే పేరు వచ్చింది. ఆ తర్వాత వనం వారి వంశీకులు ఆలయాన్ని వారి ఆధీనంలోకి తీసుకొని సమీపాన తీర్థాల గ్రామాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి శివుడికి నిత్య దూప, దీప నివేదనలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో శివలింగం భిన్నంగా ఉండడంతో, వేరే పాలరాతి శివలింగం సుమారు 600 ఏళ్ల క్రితం విమాన గోపురాలు, ముఖ మండప నిర్మాణం చేశారు. దీంతో అప్పటి నుంచి మహాశివ రాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి..

శివరాత్రి రోజు ఆ సంగమేశ్వరుడిని దర్శించుకోవడానికి లక్షల మంది భక్తులు తీర్థాల జాతరకు వస్తుంటారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ జాతరకు కావాల్సిన ఏర్పాట్లన్నింటిని అధికారులు పూర్తి చేశారు. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు అధికారికంగా ప్రారంభమయ్యే జాతర ఈ నెల 11న ముగుస్తుంది. జాతరకు ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి భక్తులు వస్తుండగా.. వాహనాలకు పార్కింగ్, దుకాణాల సముదాయాలకు కావాల్సిన స్థలాలను ఏర్పాటు చేశారు.

అధికారికంగా జాతర..

ఈ నెల 8 నుంచి ప్రారంభమయ్యే జాతరలో తొలి రోజు (శుక్రవారం) శివలింగానికి స్థానిక మంత్రులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీఓ స్థాయి అధికారులు అధికారికంగా ప్రారంభించనున్నారు. స్వామివా రికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశాక భక్తులందరికీ స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

నీరు సమకూరేనా?

ఇదిలా ఉండగా జాతరకు వచ్చే భక్తుల కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేసినప్పటికీ మున్నేరులో స్నానమాచరించడానికి సరిపడా నీటి సౌకర్యం కలగనుందా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జాతరకు ముందే మున్నేటిలో నీరు ఇంకడంతో భక్తులకు నీటి కష్టాలు ఉండే పరిస్థితి కనబడుతుంది. ప్రతి ఏటా జాతర సమయాన నీరు ఉండేలా అధికారులు చర్యలు తీసుకునే వారు. ఈ ఏడాది ఏటిలో నీరు లేకపోవడంతో పై భాగాన ఉన్న చెక్‌డ్యాం నుంచి మోటార్ల సాయంతో నీటిని కిందకు పంపించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అయితే సమయం తక్కువ ఉండడం, చెక్ డ్యాంలో కూడా సరిపోను నీరు లేకపోవడంతో భక్తులకు నీటి ఇబ్బందులు తప్పేలా లేవు.

మోటార్లతో నీరు తరలిస్తున్నాం..

ఈ ఏడాది మున్నేటిలో సరిపోను నీరు లేకపోవడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఏటి పైభాగాన ఉన్న చెక్ డ్యాం నుంచి విద్యుత్ మోటార్లతో నీటిని పంప్ చేసి దిగువకు తరలిస్తున్నాం. జాతర సమయానికి భక్తులకు ఇబ్బంది లేకుండా నీటి సౌకర్యం కల్పిస్తాం.

– శేషయ్య, ఆలయ ఈఓ

జాగ్రత్తలు పాటించాలి..

ప్రతీ భక్తుడికి స్వామి దర్శనం కలిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యాన చర్యలు తీసుకున్నాం. మొత్తం 400 మంది పోలీస్ సిబ్బందితో జాతరలో బందోబస్తు నిర్వహించనున్నాం. జాతరలో ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే పోలీసులు చేరుకునేలా చర్యలు చేపట్టాం.

– రాజిరెడ్డి, సీఐ, ఖమ్మం రూరల్

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



జక్కేపల్లిలో ఎండిపోయిన వరిపైరును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కూసుమంచి: జిల్లాలో సాగర్ ఆయకట్టుతో పాటు పాలేరు కాల్వ పరిధిలో వరి పంటలకు సాగునీరు అందక ఎండిపోయాయని, అట్టి పంటలకు పరిహారం అందించాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పాలేరు కాల్వ పరిధిలో ఎండిపోయిన వరి పొలాలను పలువురి నాయకులతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. తమకు కనీసం రెండు తడులు ఇచ్చినా పంట చేతికొస్తుందని రైతులు నాయకుల ఎదుట వాపోయారు. అనంతరం పోతినేని విలేకరులతో మాట్లాడుతూ.. వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతే కనీసం ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లా నుంచి వ్యవసాయశాఖ మంత్రితో పాటు మరో ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. రైతులను ఆదుకోలేక పోయారని, ఇదేనా మార్పు అంటూ ప్రశ్నించారు. జిల్లాలో రైతాగం పంటలు ఎక్కడ నష్టపోయారో గుర్తించేందుకు రెవెన్యూ టీంలను ఏర్పాటు చేసి నివేదిక తెప్పించుకునిరైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మి అధికారం ఇచ్చారని, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేశ్, జిల్లా నాయకులు శీలం గురుమూర్తి, ఎడవెల్లి రమణారెడ్డి, మల్లెల సన్మంతరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, ముకుంద రెడ్డి, గన్యానాయక్, కర్ణబాబు, మాధవరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న బీరెడ్డి నాగచంద్రారెడ్డి

ఖమ్మంఅర్బన్: సంఘం అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమమే ఆంధ్రా బ్యాంక్ కర్షక సేవా సంఘం ధ్యేయమని సంఘం అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా రైతులకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తుండగా.. వారు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సంఘం వార్షిక నివేదికను ఎండీ సాకేత్‌కుమార్ చదివి వినిపించారు. 2024–25 ఏడాదిలో సంఘం ద్వారా పంటరుణాలు రెన్యూవల్, తదితర వాటిపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంతు రెడ్డి, సీఎం రవి, సీఈఓ అశోక్, శివ యాదవ్, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయండి

నేలకొండపల్లి: ఖమ్మంలో నేడు(గురువారం) జరగనున్న కేటీఆర్ సభను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గండు సతీశ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడిగా తనకు రెండోసారి అవకాశం కల్పించిన సందర్భంగా కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కావునా ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు సాయంత్రం నాలుగు గంటలకు బైపాస్ రోడ్డులోని గాయత్రి గ్రౌండ్‌కు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

9న సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభ..

తిరుమలాయపాలెం: ఈ నెల 9న ప్రతిఘటన పోరాటయోధుడు రాయల సుభాష్‌చంద్రబోస్, పిండిప్రోలు మాజీ సర్పంచ్ రాయల నాగేశ్వరరావుల వర్ధంతి సభలను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు గుర్రం అచ్చయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు రాయల వెంకటనారాయణ భవనంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన నాయకుడు సుభాష్‌చంద్రబోస్ (రవన్న) అని, పిండిప్రోలు గ్రామానికి ఎనలేని సేవలు చేసి గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రాయల నాగేశ్వరరావు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, పుసులూరి పుల్లయ్య, పులిగుజ్జు వెంకటస్వామి, బానోత్ శంకర్, గొడుగు విజయ్, అరెంపుల వెంకన్న గోకినపల్లి సరోజన, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

12న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం..



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్ర భవన్‌లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా మహిళా నాయకురాలు రెడ్డిబోయిన వరలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 250 గజాల ఇంటి స్థలం ప్రకటించడం హర్షదాయకమన్నారు. ఈ సమావేశంలో కామన అనంతలక్ష్మి, ఉల్లంగి పద్మ, నల్లా స్వరూప, చౌడల పద్మావతి, మూల మూరి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి వృద్ధురాలి అప్పగింత

ఖమ్మంక్రైం: తప్పిపోయి వచ్చిన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన వృద్ధురాలు కరుణపాక వీరమ్మను ఖమ్మం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు ఆమె బంధువులకు అప్పగించారు. ఖమ్మం కరుణగిరి ప్రాంతంలో సంచరిస్తుండగా ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది నరసింహారావు గుర్తించి చేరదీశారు. ఆమె తన కుమార్తెను చూసేందుకు వస్తూ తప్పిపోయినట్లు గుర్తించి సీఐ బాలాజీనాయక్ ఆధ్వర్యాన బుధవారం బంధువులకు అప్పగించారు.

మహిళా సాధికారతకు కేంద్రం పెద్దపీట



నేలకొండపల్లి: మహిళను సన్మానిస్తున్న నాయకులు

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: మహిళ సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బుధవారం నేలకొండపల్లిలో కన్వీనర్ అనంతు ఉపేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఖమ్మంలోని ఎంఎస్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గల్లా సత్యనారాయణ మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలకు రాబోయే రోజులలో ఎక్కువ అవకాశాలు కల్పించాలని అందుకు కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు తెలిపారు. మోదీ దేశవ్యాప్తంగా కోట్లాది మంది మహిళలతో వర్చువల్ లైవ్‌లో మాట్లాడారని, బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురి మహిళలను వారు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి, ఇన్‌చార్జ్ మంద సరస్వతి, వైద్యురాలు కావ్యచందు, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రవికుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, నాయకులు కృషారావు ,పాగర్తి సుధాకర్, కందర బోయిన వెంకటరమణ, షర్ఫుద్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, వాసుదేవరావు, పమ్మి అనిత, నీలిమ, సుధాకర్, చావా కిరణ్, వీరెల్లి రాజేశ్‌గుప్త, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మందిర వార్షికోత్సవం

కామేపల్లి: స్థానిక సద్గురు అవధూతేంద్ర సరస్వతి స్వామి స్మృతి మందిర 29వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మందిరంలో హరే రామ నామ భగవన్నామ సంకీర్తనను సప్తాహాన్ని భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ ప్రారంభించారు. ముందుగా స్వామికి పాదపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేసగాని వెంకటేశ్వర్లు, నెహ్రూ, నాగయ్య, సైదులు, శ్రీనివాసచారి, భాగయ్యమ్మ, శివకృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రసంగాన్ని వీక్షించిన రైతులు

కూసుమంచి: రైతు వేదికల్లో ప్రభుత్వ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందులో భాగంగా కూసుమంచిలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా సీఎం ప్రసంగాన్ని రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీలత, కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

రఘునాథపాలెం: మండలంలోని సూర్యాతండాలో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక గ్రామ గ్రంథాలయానికి కెనరా బ్యాంక్ మేనేజర్ అంగోత్ నాగేశ్వరరావు 9 కుర్చీలను వితరణగా అందించారు. బుధవారం తన కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వితరణ చేసినట్లు తెలిపాక గ్రామస్తులు ఆయనను అభినందించారు.

సైన్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ విద్యార్థికి సైన్స్‌పై అవగాహన అవసరమని వక్తలు పేర్కొన్నారు. ఖమ్మంలో షెల్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రభుత్వ సహకారంతో ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ కార్నివాల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 17పాఠశాల నుంచి 101 మంది విద్యార్థులు పాల్గొనగా 37 ఎగ్జిబిట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజలి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఖమ్మంవన్‌టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణకుమారి



ఖమ్మంఅర్బన్: మహిళను సన్మానిస్తున్న పోటు కళావతి, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మంవన్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరంలో పలు మహిళా సంఘాల ఆధ్వర్యాన మహిళామణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14, 15 డివిజన్ కొత్తగూడెం సీపీఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఆధ్వర్యాన, జెడ్పీ సమావేశ మందిరంలో సావిత్రిబాయి పూలే మహిళా సంఘం ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకురాళ్లు మాట్లాడుతూ.. మహిళలు రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళలు పోరాడేతత్వాన్ని అలవర్చుకుని హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురి మహిళలను సన్మానించారు. ట్రైనింగ్ ఐపీఎస్ మౌనిక, గైనకాలజిస్టులు స్వర్ణకుమారి, దివ్య, పోటు కళావతి, సీఐలు రామిశెట్టి రామయ్య, శ్రీనివాస్, సీపీఐ కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేశ్‌లతో పాటు తాటి నిర్మల, టి.సువర్ణ, తుపాకుల పేరమ్మ, కర్రి కళావతి, కర్రి గంగమ్మ, చింతకాయల లచ్చమ్మ, దేవి, సరిత, షేక్ నజీమా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఖమ్మంక్రైం: టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా బొండ్ల మల్లయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం తన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా.. ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం

ఖమ్మంరూరల్: మండలంలోని కొండాపురంకు చెందిన వేమూరి ప్రమీల మొదటి ప్రయత్నంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు ఆమెను బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రమీలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వీరబాబు, పి.భద్రయ్య, నాగేంద్రబాబు, వీరభద్రం, వేమూరి రాజేంద్రప్రసాద్, కె.వంశీ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మా గృహాల్లో 'జ్యోతి' లేదు..

కేఎంసీలో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు



దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వారికి జీరో బిల్లులు జారీ చేస్తోంది. ఈ పథకం ఇటీవలే ప్రారంభం కాగా, పలువురికి జీరో బిల్లులు రాలేదని ఆందోళన చెందుతున్నారు. అయితే, మరోమారు ధ్రువపత్రాల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ఖమ్మంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి బుధవారం పోటెత్తారు. ప్రజలు పెద్దసంఖ్యలో రావడంతో అదనపు కౌంటర్లు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించారు. అదే సమయానికి కేఎంసీకి వచ్చిన కలెక్టర్ వీపీ గౌతమ్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి కొద్ది సేపు కౌంటర్‌లో కూర్చుని ఉద్యోగులకు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలని ఆదేశించారు.